# రాజు ఏతెంచుచున్నారు!

## అపొ. 1:10, 11, పరిశీలన

"రాజు ఏతెంచుచున్నా"డనే చర్చనీయాంశం పాత క్రొత్తనిబంధనలలో ఆద్యంతం ప్రతిధ్వనిస్తుంది. పాతనిబంధనలో, "రాజు వచ్చుచున్నా"డనేది భావన! సువార్త రచనలలో "రాజు యిక్కడ ఉన్నా"డనేది సందేశం! మిగిలిన క్రొత్తనిబంధనలో, "రాజు తిరిగి వస్తున్నా"డనేది చర్చనీయాంశం![1]

## పాత నిబంధన: "రాజు వచ్చుచున్నాడు!"

### ఎదురుచూపు రగిలింది

పాత నిబంధనలో, నరుడు పాపంచేసిన తరువాత, రానున్న రక్షకుని గూర్చి దేవుడు వరుసగా వాగ్దానాలు చేయ నారంభించాడు. "క్రీస్తు నరులను రక్షింప వస్తున్నట్టు ... పాతనిబంధనలో దాదాపు 380 ప్రవచనాలున్నాయి."[2] మొదటి వాగ్దానాలు సంతాన వాగ్దానాలు (ఉదాహరణకు, ఆది. 3:15; 22:18). ఏదియెలాగున్నా, కడకు, ఇశ్రాయేలీయుల ద్వారా రక్షకుడు వస్తాడని దేవుడు ప్రకటించాడు. ఇశ్రాయేలు జాతీయ రాజ్యం మీద రాజును నియమించినది మొదలుకొని, వాగ్దానాలు రాజ్యపు వాగ్దానాలుగా మారిపోయాయి.

ఉదాహరణకు, గొప్ప రాజు అరుదెంచుచున్న సంగతిని కీర్తన 2 సూచిస్తున్నట్టు యూదులు భావించేవారు.[3] "భూరాజులు యెహోవాకును ఆయన అభిషిక్తునికుని విరోధముగా నిలువబడుచున్నారు" అని మనం 3వ వచనంలో చదువుతాం. "అభిషిక్తుడు" అని తర్జుమాచేయబడిన పదం హెబ్రీలో "మెస్సీయ"; దానికి గ్రీకు సమం "క్రీస్తు." అనేకమంది ఆత్మసంబంధమైన అధికారులు నూనె[4] తో అంటబడ్డారు కాని అభిషిక్తుడంటే మాత్రం రాజు అనేది వారి భావన. మొదటి రాజైన సౌలు, "యెహోవా చేత అభిషేకము నొందినవాడు" అని గుర్తించారు (1 సమూ. 24:6, 10; 26:9, 11, 16, 23). "అభిషిక్తునికి" సంబంధించి, కీర్తన. 2లో, "నీవు నా కుమారుడవు, నేడు నేను నిన్ను కనియున్నాను" అని ఉంది (7 వ.). రాజు అరుదెంచుచున్నాడు!

మరల, దానియేలు 2:44లో, "ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు" (దానియేలు 2:44). ఇవియు యింకను యితర వాగ్దానాలను, ఇశ్రాయేలీయుల కష్టకాలములలో (చీకటి రాత్రింబగళ్ళయందు) వారిని నిలబెట్టాయి. రాజు తన రాజ్యాన్ని స్థాపించడానికి వచ్చుచుండెను!

**ఎదురు చూపు మసకబారింది**

సంవత్సరాలు గతిస్తున్నా, రాజు యింకను ప్రత్యక్షం కాలేదు, దానితో ఇశ్రాయేలీయుల ఎదురు చూపు తగ్గిపోయింది. క్రీస్తు వచ్చే సమయానికి వారి పరిస్థితులు ఎలా ఉన్నాయో Landon Saunders యిలా వర్ణించాడు:

> రోము యొక్క వైభవోత్సవం, అధికారము ఎక్కడంటే అక్కడుంది. సైనికుల ఆక్రమణ, వారి వీధులలో గుండ రాణువగస్తీ, వారి కొండమీద సైనిక కావలి, వారి పరిశుద్ధ దేవాలయాన్ని సయితం లక్షపెట్టకుండ వాగ్దాన భూమి అన్యుల పాలనలో ఉన్నట్టు ఎల్లవేళల యిబ్బందికరంగా గుర్తుచేయబడుతూ ఉండింది.[5]

క్రమేణ, మతసంబంధులమని చెప్పుకొనే వారిమధ్య సయితం జాతీయ దృష్టి భూసంబంధమైన విషయాలవైపు మార్చబడింది. కొందరి హృదయాలలో నిరీక్షణ అనే అగ్ని కణము నుసిగప్పినట్టుంది.

ఏదియెలాగున్నా, కొందరిలోనైతే, దేదీప్యమానంగా వెలుగుతుంది. ఉదాహరణకు, మరియ యోసేపులు బాలుడైన యేసును దేవాలయానికి తీసికొనిపోయినప్పుడు, సుమెయోను అను ఒక వృద్ధుడు, సంవత్సరం వెంట సంవత్సరం, "ఇశ్రాయేలు యొక్క ఆదరణకొరకు కనిపెట్టు" చుండేవాడు (లూకా 2:25) – రాజు మాత్రమే ఆ ఆదరణను తేగలడు. బాలుడైన యేసును తన కరములలోనికి తీసికొన్నవాడై, అతడు దేవుని యిలా స్తుతించాడు: "నాథా, యిప్పుడు నీ మాటచొప్పున సమాధానముతో నీ దాసుని పోనిచ్చుచున్నావు; అన్యజనులకు నిన్ను బయలుపరచుటకు వెలుగుగాను నీ ప్రజలైన ఇశ్రాయేలుకు మహిమగాను నీవు సకల ప్రజలయెదుట సిద్ధపరచిన నీ రక్షణను నేను కన్నులార చూచితిని" (లూకా 2:29, 30). కొన్నిసార్లు ఆ అగ్నిజ్వాల ఎదురుచూడని ప్రాంతాల్లో మండింది. యాకోబు బావియొద్ద అవినీతి పరురాలైన సమరయ స్త్రీతో ప్రభువు మాట్లాడినప్పుడు, ఆమె యిలా అంది: "– క్రీస్తనబడిన మెస్సీయ వచ్చునని నేనెరుగుదును; ఆయన వచ్చినప్పుడు మాకు సమస్తమును తెలియజేయును" (యోహాను 4:25).

## సువార్త రచనలు: "రాజు యిక్కడ ఉన్నాడు!"

**ఎదురు చూపు మసకబారింది**

ఏదియెలాగున్నా, అప్పుడు, ఇశ్రాయేలీయుల నిరీక్షణ అగ్నిలో నెయ్యి పోసి పెద్దమంటగా రగిలించినట్టు ఏదో ఒకటి సంభవించింది. యూదయ అరణ్యంలో యోహాను ప్రకటింపనారంభించి: "పరలోక రాజ్యము సమీపించియున్నది మారుమనస్సు పొందుడని" చెప్పసాగాడు (మత్తయి 3:2). మరో విధంగా చెప్పాలంటే, "రాజు వస్తున్నాడు – మీరు సిద్ధంగా ఉండాలి!" అనేది సందేశం. అప్పుడు జనులు – అలాగైతే మేమేమి చేయవలెనని అతనినడుగగా, అతడు – "రెండు అంగీలుగలవాడు ఏమియు లేనివాని

కియ్యవలెననియు, ఆహారము గలవాడును ఆలాగే చేయవలెననియు వారితో చెప్పెను" (లూకా 3:10, 11). అతడు సుంకరులతో – "మీకు నిర్ణయింపబడిన దానికంటె ఎక్కువ తీసికొనవద్దని" చెప్పాడు (లూకా 3:13). సైనికులతో, "– ఎవనిని బాధపెట్టకయు, ఎవనిమీదను అపనింద వేయకయు, మీ జీతములతో తృప్తి పొంది యుండుడని" చెప్పాడు (లూకా 3:14). వస్తున్న రాజుకొరకు ఎదురుచూచేలా యోహాను శ్రోతల జీవితాలు ప్రభావితం చేయబడ్డాయి!

దీర్ఘకాలంగా వారు కనిపెట్టుచుండిన రాజు – యేసే (మత్తయి 2:2; యోహాను 1:49). అయినా, ఆయన అవతరించినప్పుడు, ఆయన రాజ భవనంలో జన్మించలేదు, రాజ వస్త్రాలను ధరించలేదు, ఆయన బలీయమైన సైన్యాన్ని నడిపించనూ లేదు.[6] ఆయన రాజు అనడానికి ఈ వాస్తవాలు కొందరికి సందేహం కలిగించగా, తన రాజ్య స్థాపనను గూర్చిన సందేశం ఆయన మనస్సులోను, ఆయన పెదవులమీదను మానకుండా నిలిచింది. "పరలోక రాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొందుడి" అని ఆయన యోహాను వలెనే ప్రకటింపసాగారు (మత్తయి 4:17). "దేవుని రాజ్యము ... పోలియున్న"దంటూ, ఆయన ఉపమానాలు అనేకమైనవి ఆరంభమయ్యాయి (మత్తయి 13:31, 33, 44, 45, 47, 52; 20:1). "రాజ్యపు తాళపు" చెవులను పేతురునకు యిస్తానని ఆయన వాగ్దానం చేశారు (మత్తయి 16:19). వారి జీవితకాలంలోనే దేవుని రాజ్యం "బలముతో" వస్తుందని ఆయన తన శిష్యులకు తెలిపారు (మార్కు 9:1).

### ఎదురు చూపు మసకబారింది

విషాదకరంగా, రాజును గూర్చియు, ఆయన రాజ్యాన్ని గూర్చియు జనులు అపార్థం చేసికొన్నారు. తమ శత్రువులను జయించి భూసంబంధమైన రాజ్యమునేలే రాజకీయమైన రాజుకొరకు వారు కనిపెడుతున్నారు. ఒకనాడు యేసును ఆలాటి రాజుగా చేయడానికి జనసమూహం పోగయ్యింది, కాని ఆయన దాన్ని జరుగనియ్యలేదు (యోహాను 6:15). తరువాత, భారవాహనపు పశువునెక్కి, ఒక ఆదివారపు దినాన క్రీస్తు యెరూషలేములోనికి ప్రవేశిస్తుండగా, ఆయన వెనుక వచ్చుచుండిన జనసమూహము "– జయము ప్రభువు పేరటవచ్చువాడు స్తుతింపబడును గాక, వచ్చుచున్న మన తండ్రియైన దావీదు రాజ్యము స్తుతింపబడును గాక ... అని కేకలు వేయుచుండిరి" (మార్కు 11:9, 10). అక్కడ అప్పుడే యేసు తన రాజ్యాన్ని స్థాపించునని వారు ఎదురుచూచినట్టున్నారు – అయితే వారు నిరాశపరచబడ్డారు.

యేసు చేసిన ప్రతిపాదనలలో కొన్ని రాజువంటివిగా లేనట్టు ప్రజలు చూడసాగారు. "నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు" అని ఆయన అన్నారు (యోహాను 18:36ఎ). ఆయన చనిపోడాన్ని గూర్చి, సిలువ వేయబడడాన్ని గూర్చి మాట్లాడేవారు (మత్తయి 16:21; 17:23; 20:19) – అది రాజువలె ఉండని అంతం! ఆయన ఈ లోకాన్ని వదలివెళ్లడాన్ని గూర్చి కూడ మాట్లాడారు (యోహాను 16:28 చూడు).

ఏది యెలాగున్నా, ఆయన మరల తిరిగి వస్తానని కూడ తెలిపారు.[7] ఈ ప్రసంగంలోని సందేశంలో ముఖ్యమైన విషయం అదే. మత్తయి 24, 25ల్లో విస్తరింప చేసిన చర్చలో

మన మీ మాటలను కనుగొంటాం:

> నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయు ఆలాగే ఉండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినమువరకు, వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచునుండి జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొని పోవువరకు ఎరుగక పోయిరి; ఆలాగుననే మనుష్యకుమారుని రాకడ ఉండును (24:37-39).
>
> కావున ఏ దినమున మీ ప్రభువు వచ్చునో మీకు తెలియదు గనుక మెలకువగా నుండుడి (24:42).
>
> తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతోకూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనముమీద ఆసీనుడైయుండును. అప్పుడు సమస్త జనములు ఆయనయెదుట పోగుచేయబడుదురు; గొఱ్ఱెలవాడు మేకలలోనుండి గొఱ్ఱెలను వేరుచేయునట్లు ఆయన వేరు పరిచి, తన కుడివైపున గొఱ్ఱెలను ఎడమవైపున మేకలను నిలువబెట్టును ... వీరు నిత్య శిక్షకును – నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు" (25:31-46).

మేడగదిలో తన అపొస్తలులతో కూడ ప్రభువైన యేసు సాటిలేని తన వీడ్కోలు చర్చలో యిలా వాగ్దానం చేశారు:

> మీ హృదయములు కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్దనుండుటకు మిమ్మును తీసికొని పోవుదును (యోహాను 14:1-3).

ఏదియెలాగున్నా, క్రీస్తు ప్రభువు ఈ మాటలు పలికిన మరుసటి ఉదయాన – ఆయన రోమా సిలువకు మేకులతో కొట్టబడ్డారు – తన శిష్యుల కలలు, ఆశలు, నిరీక్షణలు నేలకు కొట్టబడినట్టయ్యాయి.

## కార్యగ్రంథము, పత్రికలు:
## "రాజు మరల వచ్చుచున్నాడు!"

**ఎదురు చూపు మండుతుంది**

యేసు మృతులలోనుండి మూడవ దినమున లేపబడగానే నిరీక్షణ ఉజ్జీవింప జేయబడింది. ఆయన తన అపొస్తలులతోకూడ నలువది దినములు కలిసికొంటూ ఉండి, ఆయన పరలోకానికి ఆరోహణమయ్యే కార్యక్రమానికి వారిని సిద్ధపరచుతున్నారు. చివరికి, ఆయన వెడలిపోయే కాలం వచ్చింది. ఒలీవల కొండయొక్క తూర్పు చరియయందలి

ఒక చోటుకు వారిని నడిపించి, వారిపై చేతులుంచి వారిని ఆశీర్వదించి, పరలోకమునకు కొనిపోబడ్డారు. "ఆయన వెళ్లుచుండగా" అపొస్తలులు ఆకాశమువైపు తేరిచూస్తూ ఉండగా, "యిద్దరు దేవదూతలు వారి యొద్ద నిలిచియుండిరి" (అపొ. 1:10) "– గలిలయ మనుష్యులారా, మీరెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు? మీయొద్దనుండి పరమునకు చేర్చుకొనబడిన యీ యేసే, ఏరీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" (అపొ. 1:11). క్రీస్తు అనుచరులకు ఒక క్రొత్త సందేశము అందించబడింది: "రాజు తిరిగి రానైయున్నాడు" అనేది!

"రాజు వస్తున్నాడు" అనే సందేశం ఇశ్రాయేలీయులకు ఎలా నమ్మిక కలిగించిందో, ఆలాగే "రాజు తిరిగి రానైయున్నాడు" అనేది వారిని బలపరచింది, అది క్రైస్తవులకు సాయపడింది. దైవ ప్రేరేపితులగు లేఖకులు ఈ అంశాన్ని సూచిస్తునే వచ్చారు. ఒక రచయిత ప్రకారం, మనుష్యులకు తీర్పు తీర్చుటకు ఆయన రెండవమారు వస్తున్నారనడానికి క్రొత్తనిబంధనలో "కనీసం 370 వచనాలు సూచిస్తున్నాయి. క్రొత్త నిబంధనలోని 7,959 వచనాలలో, ప్రతి 25వ వచనం క్రీస్తు మరలవచ్చుననే చర్చనీయాంశాన్ని తాకుతుంది. క్రొత్తనిబంధనలోని 27 పుస్తకాలలో 23నందు ఈ సిద్ధాంతం బోధించబడింది."[8] ఈ అంశాన్ని సూచించేవాటిలో ఈ క్రింద ఉన్న కొన్ని వచనాలను పౌలు యిలా రాశాడు,

> మన పౌరస్థితి పరలోకమునందున్నది; అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోబరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగల దానిగా మార్చును (ఫిలిప్పీ. 3:20, 21).

రాజు తిరిగి వచ్చినప్పుడు, క్షయమయ్యే ఈ బలహీనమైన దేహము నూతనమైన దేహముగా మార్చబడుతుంది. మనకు ఆత్మ సంబంధమైన శరీరాలు యివ్వబడతాయి – ఆ దేహాలు మహిమగల ఆయన "శరీరమునకు సమరూపముగా మార్చబడతాయి"!

థెస్సలొనీకయలోని క్రైస్తవులకు పౌలు యిలా తెలియజేశాడు:

> మేము ప్రభువు మాటనుబట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించినవారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును. క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు.[9] ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము (1 థెస్స. 4:15-17).

ఆ ముందటి దినాల్లో, థెస్సలొనీకయలోని క్రైస్తవులలో అనేకమంది ప్రియులను శారీరకంగా పోగొట్టుకొననైయున్నారు. అందును బట్టివారు ఏమి కంగారు పడనవసరంలేదని పౌలు వారికి తెలియజేశాడు. నీతిమంతులైన మృతులు తమ బహుమానాన్ని కోల్పోలేదని, తమ రాజు తిరిగివచ్చినప్పుడు, వారు లేపబడతారని అభయమిచ్చాడు. "కాబట్టి మీరు

ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి" అని చెప్పాడు (1 థెస్స. 4:18).

రాజు తిరిగి వస్తారనే చర్చనీయాంశాన్ని యోహాను యిలా ప్రతిధ్వనింపజేశాడు: "కాబట్టి చిన్న పిల్లలారా, ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన రాకడయందు మనము ఆయనయెదుట సిగ్గుపడక ధైర్యము కలిగియుండునట్లు మీరాయనయందు నిలిచి యుండుడి" (1 యోహాను 2:28). రాజు వచ్చునప్పుడు మనము సిద్ధపడినవారమై యుంటిమా ధైర్యముగలిగియుందుము - సిద్ధపడక యుంటిమా - అవమానము నొందుదుము. 1 యోహాను 3:2 యిలా అంటుంది: "ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము."

ఇతర లేఖన భాగాలను కూడా చూడవచ్చును గాని క్రీస్తు రాకడ మరల మనస్సునకు తెచ్చుకొను చర్చనీయాంశమైయుంది. ఇప్పుడు మనము క్రొత్తనిబంధన ముగింపునకు వెళ్లుదాం. క్రీస్తు ప్రభువు యిచ్చిన చివరి వాగ్దానం యిది: "ఇదిగో త్వరగా వచ్చుచున్నాను, వానివాని క్రియల చొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది" (ప్రకటన 22:12). "త్వరగా వచ్చుచున్నాను" అనే మాటలు కొందరికి వింతగా తోచవచ్చు. ఎందుకంటె వందలకొలది సంవత్సరాలు గతించిపోతూనే ఉన్నాయి.[10] Bill Banowsky యిలా అన్నాడు,

> బైబిల్లోని ముగింపు పేరాగ్రాపుల్లో ఉన్న "త్వరగా" అనే పదం భూసంబంధమైన హద్దుగల కాలపు దృష్టితో చూడకూడదు, దేవుని జీవముయొక్క కాలము లేనిదానిచే (చూడాలి), మన లెక్క ప్రకారం రెండువేల సంవత్సరాలు వచ్చిపోయాయి, ఆయనకైతే వెయ్యి సంవత్సరాలు ఒక దినమువలెనున్నవి. దేవుడు మనకులా చేతి గడియారం కట్టుకోలేదు.[11]

ఆయన రాక "ఆలస్యములేక" అనే భావనను ఉద్దేశించినట్టు క్రీస్తు మాటలు తెలుపవు గాని "సమీపముననున్న" అన్నట్టు సూచిస్తున్నవని బోనౌస్కి అభిప్రాయపడ్డాడు.[12] "సమీపముననున్న" అంటే, అది ఏ క్షణములోనైనా సంభవించవచ్చు అని అర్థం. ఇది సత్యమని ఆది క్రైస్తవులు నమ్మారు. మనం కూడ అలాగే విశ్వాసబద్ధులమై ఉన్నాం. అక్కడనుండి బైబిలు చివరి వచనంవరకు యోహాను ప్రభువు వాగ్దానాన్ని తిరిగి చెప్పాడు: "ఈ సంగతులను గూర్చి సాక్ష్యమిచ్చువాడు అవును, త్వరగా వచ్చుచున్నానని చెప్పుచు న్నాడు" (ప్రకటన 22:20ఎ) "ఆమేన్, ప్రభువైన యేసూ, రమ్ము" (ప్రకటన 22:20బి).

కన్పించేట్టున్నూ, వినిపించేట్టున్నూ,[13] హెచ్చరిక లేకుండను,[14] శక్తితోను, మహిమతోను రాజు రానైయున్నట్టు క్రొత్తనిబంధన రచయితలు బోధించారు. ఆయన మృతులను లేపి సకల జనములకు తీర్పు తీర్చి, బహుమానాలను శిక్షను అమలుచేయనైయున్నట్టు వారు ఉపదేశించారు.[15] అన్యాయంతో నింపబడిన లోకంలో, సమస్తాన్ని చక్కచేయుటకు రాజు వస్తారనే సందేశాన్ని వారు పంచుకొన్నారు!

రాజు తొలిగా వస్తున్నట్టు చూచిన ఎదురు చూపులో, ఇశ్రాయేలీయుల జీవితాలు

ప్రభావితం చేయబడ్డాయి. అలాగే, ఆయన రెండవ రాకడకొరకైన ఎదురుచూపులో ఆది క్రైస్తవుల జీవితాలు ప్రభావితం చేయబడ్డాయి:

- అది వారిని మార్చివేసింది. వారి దృక్పథాన్ని మార్పుచేసింది. "రాజు తిరిగి వస్తారనే" భావన జీవితాన్ని వారు మరో విధానంలో చూడడానికి, వారి ఆలోచనకు కేంద్రమైయుంది.
- అది వారిని పోటీకి పిలిచింది. రెండవ రాకడను గూర్చి పేతురు మాట్లాడుతూ యిలా రాశాడు,

> అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమై పోవును, భూమియు దాని మీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, ... దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను (2 పేతురు 3:10-12).

  "రాజు వస్తున్నాడని" యోహాను యూదులకు తెలిపినప్పుడు, వారు మారుమనస్సు పొంది, తమ జీవితాలను మార్చుకొన్నారు. "రాజు మరల వస్తాడనే" వాస్తవాన్ని పేతురు తెలిపినప్పుడు, అది మన జీవితాలను మార్చుకునేలా చేయాలి. మన దేశపు ప్రధాని[16] మీ యింటికి భోజనానికి వస్తానని ప్రోగ్రాం యిస్తే, ఏమి జరుగుతుంది? "నేను ఏమి ధరించుకోవాలి? నేను ఆయనకు ఏమి పెట్టాలి? నా యిల్లును ఎలా సర్దుకోవాలి" అని నిన్ను నీవు అడుగుకొనవా? రాజు అరుదెంచుచున్నాడని మనం ఆలోచించినప్పుడు, మన మనస్సుల్లో పనిచేయవలసిన ప్రధాన ప్రశ్న ఏమంటే – "మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై" ఉండాలని పేతురు తెలుపుతున్నాడు.
- అది వారిని స్థిరపరచింది. రాజు తిరిగి వస్తున్నాడన్న వాస్తవంలో వారు బలముపొందారు. వారి జీవితాలకు ఏమి సంభవించినా సరే, రాజు వచ్చేది ఖాయం, ఆయన వచ్చి వారికి న్యాయం తీర్చుతాడు. యోహానువలె వారు కూడ "ప్రభువైన యేసూ, రమ్మూ" అని వారు ప్రార్థించారు. "మరన్ఆత" అనే మాట వారికి ఉంది (1 కొరింథీ. 16:22బి); అది అరామి పదం, దానికి ప్రాథమికంగా, "ప్రభువా రమ్ము" అని అర్థం. అది ఆయన వచ్చుననే విశ్వాసాన్ని వ్యక్తపరచునదైయుంది; మరియు ఆయన త్వరగా వచ్చునట్లు ప్రార్థనయైయుంది. అది మనకు పేతురు తెలిపినట్టు "దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు దానిని ఆశతో ఆపేక్షించుచు"ండాలి (2 పేతురు 3:12). "ప్రభువు రాకడకొరకు నిట్టూర్పువిడువక పోవడం ఒక రకమైన భ్రష్టత్వంగా భావింపబడుతూ ఉండవచ్చు"నని Massillon అభిప్రాయ పడ్డాడు.[17]

- అది వారిని ఆదరించింది. రాజు నిజంగా తిరిగి వేంచేయనున్న విషయాన్ని పౌలు థెస్సలొనీకయులకు నమ్మిక కలిగించడానికి యిలా రాశాడు: "కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి" (1 థెస్స. 4:18). వారు ఒకవేళ తమ విశ్వాసం కొరకు చావవలసివచ్చినా, వారు నిరంతరం ఆయనతో కూడ ఉండబోతారు!

## ఎదురు చూపు కాంతి విహీనమయ్యింది

పంథొమ్మిది వందల సంవత్సరాలకు ముందు బైబిల్లో రెండవ రాకడను గూర్చి చివరి వచనం వ్రాయబడింది. శతాబ్దాలు గడిచి పోయాయి, రాజు యింతవరకు రాలేదు. మనము భూసంబంధమైన వాటిచేత బంధింపబడి, మన కన్నులు పరలోకంవైపు చూడ మానివేశాం. ఇప్పుడు రెండవ రాకడను గూర్చి మాట్లాడే అనేకులకు ఆనందపారవశ్యం, శ్రమలు – భూమిమీద క్రీస్తు ఏలుబడి అనే తప్పుడు బోధలలో మనుష్యులను రెచ్చగొట్టుతూ ఉన్నారు.[18] మనలో ఎక్కువ మంది భూసంబంధమైన మనస్సుతో, ఈ జీవిత విధానాల్లోనే స్థిరపడ్డాం. రాజు యొక్క రాక మన మనస్సుల్లో నీరు కార్చబడి, తొలి శతాబ్దంలోని క్రైస్తవులను ప్రభావితం చేసినట్టు మనం ప్రభావితం చేయబడడం లేదు:

- మనం దానిచేత మార్చబడడంలేదు. మన చుట్టునున్న క్రైస్తవేతరులవలెనే, మన ఆలోచనలు కూడ ఈ జీవితమును గూర్చి కార్య నిమగ్నతగలవారమై ఉంటాం.
- మనం దానిచే సవాలు చేయబడలేదు. అన్నివేళల సిద్ధంగా ఉండాలనే అవసరము అనేకులు చూడలేకపోతున్నారు.
- మన దృష్టి లోకంపై నిలుపుతున్నందున, ఆ సత్యము తెచ్చే స్థిరత్వముగాని – బలముగాని – మనకు ఉండకుండాపోతుంది. భూసంబంధమైన జీవిత విషయాలచే మనము బంధింపబడినవారమైయున్నాం.
- "రాజు ఏతెంచుచున్నాడని!" విశ్వసించినందువలన ఆది క్రైస్తవులు అనుభవించిన ఆదరణ మనం అనుభవించలేక పోతున్నాం. ఈ ఆదరణ మనకు అవసరం. మనం అణగగొట్టబడినప్పుడు, ఈ లోకము విడిపోతున్నట్టు మనకు కన్పించినప్పుడు, దుష్టత్వమే యుద్ధమందు విజయం సాధించుతున్నట్టు అనిపించినప్పుడు, స్థానిక సంఘములు, సంఘ సభ్యులు మనలను నిరాశపరచుతున్నప్పుడు, "రాజు అరుదెంచుచున్నాడని" గుర్తించినా కలిగే ప్రయోజనమేమి? అంతములో సమస్తము చక్కదిద్ద బడతాయి!

ప్రభువు రాకడ సమీపమైయున్నదనే క్రొత్తనిబంధన క్రైస్తవుల ఉత్సాహము పునరుద్ధరింపబడకుండ, క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించే కార్యక్రమం సంపూర్ణము కాలేదని ఒక వ్యక్తి అన్నాడు. మనం ఏమి చేయాలి? రెండవ రాకడపైన మనం ఎక్కువగా

ప్రసంగించవచ్చు, ఉపదేశించవచ్చు. ఈ అంశానికి సంబంధించి అనేక గొప్ప పాటలు ఏర్పాటు చేయవచ్చు;[19] ఈ పాటలు పాడవచ్చు. అయినా, మిగిలి పోయిన అతి గొప్ప అవసరత ఏమంటే, ఏమి సంభవించినా జీవితాన్ని మనం ఈ కోణంలోనుండి చూడాలనే భావన వ్యక్తిగతమైన క్రైస్తవ హృదయములో లోతుగా నాటబడియుండాలి: "రాజు వస్తున్నాడు! సత్యం తరువాత వచ్చే అయిదు నిమిషాలలో ఆయన రావచ్చు, రాకపోవచ్చు ఆయన రాగలడు కూడ. రాజు వేంచేయుచున్నాడు – అది ప్రతిదాన్ని మార్పు చేస్తుంది!"

## ముగింపు

రాజు యిప్పుడే అరుదెంచినట్టయితే, నీ రియాక్షన్ ఏమైయుంటుంది? తటాలున బూరధ్వని వినబడి, ఈ బిల్డింగ్ యొక్క పై కప్పు మధ్యకు రెండుగా చీలిపోతే ఏమి జరుగుతుంది? పైకి తేరిచూడగానే, క్రీస్తు వారి మహిమ, ఆయన దూతలు కన్పించితే ఎలాగుంటుంది? బూరధ్వని వినిన జనులు యిక్కడ అక్కడనుండి లేస్తే ఏమి జరుగుతుంది? (1 థెస్స. 4:16, 17 లను చూడు). ఆయన తిరిగి వచ్చుట చూచి ఆనందంతో గంతులు వేస్తావా? లేక యోహానుతో ఏకీభవించి, "ఆమేన్, ప్రభువైన యేసూ, రమ్ము" అని, ఆమేన్ అనే మాట నిజంగానే అనగలుగుతున్నారా! (ప్రకటన 22:20బి)? రాజు అరుదెంచు చున్నాడు! ఆయన రానైయున్నట్టు నీవు నమ్మవచ్చు. ఆయన రాకకొరకు నీవు సిద్ధపడకయున్నట్టయితే, నీవు సిద్ధపడియుండాలని నేను ప్రార్థిస్తున్నా.[20]

## నోట్సు

నేను మత ప్రసంగ వేదిక పైకెక్కినప్పటినుంచి రెండవ రాకడను గూర్చి బోధించాను. ఈ విషయాన్ని గురించి రాసినవారికి, మాట్లాడినవారందరికి నేనెంతో కృతజ్ఞుడ్ని. "The King Is Coming!" ("రాజు వచ్చుచున్నాడు") అనే ఈ ప్రసంగానికి అనేక మూలాలను ఉపయోగించాను. Landon B. Saunders, in *Abilene Christian University Lectures* (1980), 103–15నుండి ఈ పేరు సేకరించబడింది.

రెండవ రాకడను గూర్చి ప్రసంగించగోరినప్పుడు దానికి సంబంధించిన పాటలను పాడవచ్చు.

---

సూచనలు

[1]"క్రీస్తు వస్తున్నాడు," "క్రీస్తు యిక్కడున్నాడు," "క్రీస్తు మరల వచ్చును" అనేవి మామూలే. [2]William S. Banowsky, *Sermons of William S. Banowsky*, Great Preachers of Today series, vol. 11, ed. J. D. Thomas (Abilene, Tex.: Bibilical Research Press, 1965,) 211. క్రీస్తును గూర్చిన పాతనిబంధన ప్రవచనాల సంఖ్య ప్రాముఖ్యం కాదు. [3]"రాజరికపు" కీర్తనగా కీర్తన. 2 ఇశ్రాయేలు భూసంబంధమైన రాజులకు వర్తింపజేయబడింది. అయితే

మెస్సీయ వచ్చేవరకు అది సంపూర్ణంగా నెరవేర్చబడదని ఎక్కువమంది యూదులు నమ్మేవారు. ఈ కీర్తనలోని భాగాలను క్రొత్తనిబంధన లేఖకులు క్రీస్తుకు వర్తింపజేశారు (అపొ. 13:33; హెబ్రీ. 1:5; 5:5; ప్రకటన 12:5). [4]ఉదాహరణకు, తమ నియామకంలో భాగంగా యాజకులు నూనెతో అభిషేకింపబడేవారు; కొన్నిసార్లు ప్రవక్తలు కూడా అలాగే చేయబడ్డారు. [5]Landon B. Saunders, "The King Is Coming!" *Abilene Christian University Lectures* (1980), 104. [6]దేవుని మార్గాలు మన మార్గములవంటివి కావు (యెషయా 55:8, 9). [7]మత్తయి 16:27; 26:64 మొదలైనవి చూడు. [8]Banowsky, 211. [9]వెయ్యేండ్ల పరిపాలనావాదులు ఈ లేఖన భాగాన్ని "ఆనంద పారవశ్యం" అని వారు పిలిచే సిద్ధాంతానికి ఉపయోగించేవారు. "మొదట" అనే మాటను వారు నొక్కి చెప్పి – అనీతిమంతులకంటె, నీతిమంతులు మొదట వస్తారనీ, రకరకాలుగా దీన్ని తిప్పుతారు. పైన విందు, క్రింద కుందు అంటూ ఏవో కథలు చెప్పుతారు. అయితే ఈ సందర్భంలో క్రీస్తునందు సజీవులకంటె, క్రీస్తునందు మృతులు శ్రేష్ఠమైనవారు అనేది ఉద్దేశమే తప్ప వేరుకాదు – మంచి, చెడ్డ – వారందరు ఒకేసారి లేపబడతారనేది బైబిలు సందేశం (యోహాను 5:28, 29). [10]ఈ లేఖన భాగము రెండవ రాకడకు సంబంధించిందని, దుష్టులైన మనుష్యుల మీదికి తీర్పుకు తాత్కాలికమైన రాకయని కొందరు నమ్ముతారు. ఏదియెలాగున్నా, ప్రకటన గ్రంథపు ముగింపులో రెండవ రాకడ అనే అంశం చర్చింపబడినట్టు కన్పిస్తుంది.

[11]Banowsky, 213-14. [12]Ibid., 213. [13]క్రీస్తు రాకడకు సమయాన్ని చెప్పనారంభించినవారున్నారు. అయితే వారు సూచించిన దినాన ఆయన రానందున, తమ గౌరవాన్ని కాపాడుకొనడానికి గాను కొందరు – ఆయన రహస్యంగా, వచ్చాడు – కొద్దిమందిని తీసికొనిపోయాడు – తక్కినవారికొరకు తరువాత వస్తాడని కొందరంటే – వచ్చేది యింకా ఏమీలేదు, ఈ భూమియే పరదైసుగా మార్చబోతాడు అని వంకర మాటలు చెప్పనారంభించారు. క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు ప్రతి నేత్రము ఆయనను చూచునని బైబిలు బోధిస్తుంది (ప్రకటన 1:7). [14]ఆయన "దొంగవలె" వచ్చునను క్రొత్త నిబంధన ఉపదేశాన్ని (1 థెస్స. 5:2; మత్తయి 24:42–44; 1 థెస్స. 5:4; 2 పేతురు 3:10; ప్రకటన 3:3; 16:15) – క్రీస్తు రాకడకు సమయాన్ని సూచించేవారు, లక్ష్యపెట్టరు. [15]రెండవ రాకడను గూర్చి నొక్కి చెప్పుటకు ఇక్కడ కొద్దిగా ఆగాలి. "క్రీస్తు రెండవ రాకడ" అనే పాఠమును "క్రీస్తు జీవితం, 6"లో చూడు. [16]గౌరవనీయులైన వారిని గూర్చి ఉపయోగించు. [17]Quoted in Banowsky, 214. Jean Baptiste Massillon, "The Bishop of Cleremont" అని పిలువబడ్డాడు. Louis IV of Franceకు ఆస్థాన ప్రసంగీకుడుగా పని చేశాడు. [18]ప్రసిద్ధిగాంచిన మనుష్య సిద్ధాంతాల ఎక్కువ వివరణ కొరకు "ప్రకటన, 1, 5" చూడు. [19]ఈ చర్చనీయాంశముతో ఉన్న పాటను ప్రసంగమునకు ముందుగా వాడినయెడల అందులోని పదాలను క్లుప్తంగా వివరించు. [20]నీ మంచి పనులకంటె క్రీస్తు బలియాగమునందు నమ్మికయుంచి. ప్రేమతోకూడిన విధేయతతో ఆయనవైపు మరలండని నీవు చెప్పవచ్చు (మార్కు 16:15, 16; అపొ. 2:38). తప్పిపోయిన క్రైస్తవులు తిరిగి పునరుద్ధరింపబడవచ్చు (అపొ. 8:22; యాకోబు 5:16).